రెండు బార్‌షాపులపై కేసు నమోదు

సుబేదారి, ఏప్రిల్ 7: హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో సమయపాలన పాటించని మాతా బార్, వైశ్రాయి బార్‌పై కేసు నమోదు చేసినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీశ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయ పాలన పాటించని బార్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుడిసెల పరిశీలన

కాశీబుగ్గ, ఏప్రిల్ 7: నగరంలోని 3వ డివిజన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ఎస్ఆర్ఎస్‌సీ స్థలంలో వేసిన గుడిసెలను (స్టాలిన్‌నగర్) పోలీసులు తొలగించారు. సీపీఎం నాయకుడు అక్కెనపల్లి యాదగిరి ఆధ్వర్యంలో నాయకులు కూల్చివేసిన గుడిసెలను పరిశీలించారు. పేదల గుడిసెలను నేలమట్టం చేయడం దుర్మార్గపు చర్య అని అన్నారు. వెంటనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రాజు (ఫైల్)

హసన్‌పర్తి, ఏప్రిల్ 7: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన హసన్‌పర్తిలో ఆదివారం జరిగింది. సీఐ సురేశ్ కథనం ప్రకారం.. మండలంలోని అనంతసాగర్‌కు చెందిన గిన్నారపు రాజు(34) తన బైక్‌పై హనుమకొండకు వెళ్తుండగా, హసన్‌పర్తి చెరువుకట్ట వద్ద హనుమకొండ నుంచి ఎల్కతుర్తి వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్షుద్రపూజల కలకలం

వర్ధన్నపేట, ఏప్రిల్ 7 : మండలంలోని ఇల్లంద గ్రామ శివారులో క్షుద్రపూజలు కలకలం రేపాయి. గ్రామం నుంచి కుమ్మరిగూడేనికి వెళ్లే దారిలో గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేసినట్లు స్థానికులు గుర్తించారు. రహదారికి సమీపంలో చెట్టు వద్ద పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, కొబ్బరికాయలతో పూజలు చేయడంతోపాటు పందిని బలిచ్చారు. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

పులుకుర్తిలో వ్యక్తి అదృశ్యం

దామెర, ఏప్రిల్ 7: పులుకుర్తికి చెందిన దండు రవీందర్(42) అదృశ్యమైనట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు. గ్రామానికి చెందిన రవీందర్ శనివారం దామెరకు బైక్‌పై వచ్చాడు. కూలి పనులు ముగించుకొని సాయంత్రం గ్రామానికి చేరుకున్నాడు. కానీ, ఇంటికి తిరిగి రాలేదు. అతడి భార్య శ్రీలత ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేటి ప్రజావాణి రద్దు

ఖిలావరంగల్, ఏప్రిల్ 7: వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. అధికారులు, సిబ్బంది పార్లమెంట్ ఎన్నికల విధుల్లో నిమగ్నమైనందున ఈ వారం గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

బల్దియాలో వైట్ కాలర్ కార్మికులు

- వీరు పనిచేయరు
- అందరూ ప్రజాప్రతినిధుల అనుచరులే
- ఇంటివద్దకే హాజరు మిషన్
- ప్రశ్నించాలంటే అధికారులకు వణుకు

వరంగల్, ఏప్రిల్ 7: బల్దియాలో వారి స్టైలే వేరు. వారు ఎక్కడా పని చేయరు. పైగా ప్రశ్నించిన వారిపై రుబాబు. వారి ఇంటి వద్దకే బయోమెట్రిక్ మిషన్ వెళ్లాల్సిందే. ఇది బల్దియా ప్రజారోగ్య విభాగంలో వైట్ కాలర్ కార్మికుల తీరు. ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉండడంతో పాటు వారి అనుచరులుగా ముద్ర ఉండడంతో అధికారులు ఏమి అనలేక ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. వారిని ప్రశ్నించాలంటే అధికారుల వెన్నులో వణుకు పుడుతోంది. మూడేళ్ల కిత్రం బల్దియాలో నియామకమైన 452 మంది కార్మికుల్లో సుమారు 100 మందికి పైగా వైట్ కాలర్ కార్మికులు ఉన్నారు. వీరంతా ప్రజాప్రతినిధుల అనుచరులు, కార్పొరేటర్ల కుటుంబ సభ్యులు కావడంతో వారిని అడిగే ధైర్యం బల్దియా అధికారులు చేయడం లేదు. వారు ఎక్కడ ఉంటే అక్కడికే జవాన్లు బయోమెట్రిక్ మిషన్లు తీసుకువెళ్లి హాజరు వేసుకుంటున్నారు. మరి కొందరు పారిశుధ్య కార్మికులుగా చేరి, ఇతర విభాగంతో పని చేస్తున్నట్లు నటిస్తున్నారు.

వందకు పైగా కార్మికులు..

బల్దియాలో వందకు పైగా వైట్ కాలర్ కార్మికులు ఉన్నారు. వీరంతా క్షేత్ర స్థాయిలో చీపురు పట్టింది లేదు.. పారా పట్టింది లేదు. కానీ, హాజరు మాత్రం 30 రోజులు కచ్చితంగా ఉంటుంది. అన్నీ తెలిసి ఏం చేయలేక పోతున్నామని అధికారులే అంటుండడం గమనార్హం. డివిజన్లలో పారిశుధ్య కార్మికులుగా చేరి వైట్ కాలర్ కార్మికులుగా చెలామణి అవుతున్న వారు వందకు పైగా ఉన్నట్లు అధికారిక లెక్కలు చెప్పుతున్నాయి. 452 మంది కార్మికులను నియమించుకోవాలన్న ప్రతిపాదనలు వచ్చిన వెంటనే అప్పటి మేయర్ ఏకంగా కార్పొరేటర్‌కు మూడు చొప్పున పోస్టులు పంచేశారు. దీంతో కొంత మంది కార్పొరేటర్లు ఒక్క ఉద్యోగాన్ని రెండు నుంచి మూడు లక్షలకు అమ్మకానికి పెట్టారు. మరికొందరు కార్పొరేటర్లు తమ కుటుంబ సభ్యులనే నియమించారు. అప్పటి ఎమ్మెల్యేలు తమ అనుచరులను పదుల సంఖ్యలో చేర్పించారు. మంత్రుల సిఫార్సులతో చేరిన వారు మరి కొందరు ఉన్నారు. వీరు ఉద్యోగంలో చేరినప్పటి నుంచి పనులు చేసింది లేదు. అయినా ప్రతి నెలా జీతాలు మాత్రం తీసుకుంటుంటున్నారు. ప్రజాధనం దుర్వినియోగమవుతోంది. పనిచేయకుండా దర్జాగా జీతాలు తీసుకుంటున్న కార్మికులను కార్పొరేషన్ అధికారులు వైట్ కాలర్ కార్మికులుగా పిలువడం గమనార్హం. వారిపై చర్యలు తీసుకోవాలంటే అధికారులు వణికిపోతున్నారు. ఎవ్వరిని మందలిస్తే ఏ నాయకుడి నుంచి చీవాట్లు తినాల్సి వస్తుందో అని భయపడి పోతున్నారు. కార్మిక సంఘాల నాయకులకు ఇదంతా తెలిసినా నోరుమెదపడం లేదు. ఎలాంటి అండదండలు లేని కార్మికులు రోజు తెల్లవారుజామున 5 గంటలకు వెళ్లి హాజరు వేసుకుంటుంటే వైట్ కాలర్ కార్మికుల కోసం ఇంటి వద్దకే హాజరు మిషన్ వెళుతుండడంపై కార్మికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా వైట్‌కాలర్ కార్మికులపై కొత్తగా వచ్చిన కమిషనర్ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

డీజేల వినియోగానికి అనుమతి లేదు

సుబేదారి, ఏప్రిల్ 7: డీజేలు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. అర్ధరాత్రి సమయాల్లో అధిక శబ్దాలతో పెళ్లి ఊరేగింపులు చేయడం వల్ల వృద్ధులు, ఆరోగ్య సమస్య ఉన్నవారు, పరీక్ష కోసం చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. అందుకే డీజేల ఏర్పాటుకు అనుమతి లేదని, ఎవరైనా ఏర్పాటు చేసుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకొని, డీజేలు సీజ్ చేస్తామని ఏసీపీ హెచ్చరించారు. వివాహ ఊరేగింపులు కూడా రాత్రి 10:30లోపు ముగించుకోవాలని సూచించారు.

పనులను వినియోగించుకోవాలి

దామెర, ఏప్రిల్ 7: ఉపాధి పనులను కూలీలు వినియోగించుకోవాలని ఏపీవో శారద సూచించారు. ఊరుగొండ, ల్యాదెళ్ల, దామెర, కోగిల్వాయిలోని చెరువుల వద్ద చేపట్టిన పూడికతీత పనులను ఆదివారం ఆమె పరిశీలించారు. జాబ్‌కార్డులు ఉన్న కూలీలందరికీ పనిదినాలను కల్పిస్తామన్నారు. పని ప్రదేశంలో షెడ్స్, వాటర్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



ట్రోఫీ గెలుచుకున్న ఎస్ఆర్ యూనివర్సిటీ విద్యార్థులు

క్రికెట్ టోర్నమెంట్‌లో ఎస్సార్ విజయం

ఖిలావరంగల్, ఏప్రిల్ 7 : బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో వాగ్దేవి ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నారు. తొలిరోజు ఎస్ఆర్ యూనివర్సిటీ, బిట్స్ కళాశాల మధ్య మ్యాచ్ జరిగింది. ఎస్ఆర్ యూనివర్సిటీ టీం 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 203 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో బిట్స్ కళాశాల జట్లు 18 ఓవర్లలో 172 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఎస్సార్‌కు చెందిన విద్యార్థి రిష్యంత్ 41 బంతుల్లో 71 పరుగుల చేసి ఒక వికెట్ పడగొట్టి ఆల్‌రౌండ్ ప్రతిభ చూపాడు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయపర్తి/ఐనవోలు, ఏప్రిల్ 7 : పెర్కవేడు, సూర్యతండా గ్రామ పంచాయతీల్లో సోమవారం ఉదయం 7 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ తరుణ్‌కుమార్ తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులతోపాటు చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు. అలాగే, ట్రీ కట్టింగ్, సబ్‌స్టేషన్ నిర్వహణ నేపథ్యంలో ఐనవోలు మండలంలోని వెంకటాపురం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని వన మాలకనపర్తిలో బావుల దగ్గర విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

మాట్లాడుతున్న సదాంత్

బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేద్దాం..

గిర్మాజీపేట, ఏప్రిల్ 7: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలందరూ సమష్టిగా కృషి చేసి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని డివిజన్ అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్ కోరారు. ఆదివారం 29వ డివిజన్‌లోని బాబూ జగ్జీవన్‌రాం కమ్యూనిటీ హాల్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కో ఆర్డినేటర్ రాచర్ల రాము, తాళ్లపల్లి రమేశ్, గట్టు చందు, ఎండీ షఫీ, అహ్మద్, గట్టు శివ, భీంరాజ్, సూరం గోపి, మాల్వా రవి, బత్తుల వెంకటేశ్వర్లు, మహేందర్, క్రాంతి, కరుణాకర్, చంటి, జావేద్, శంకర్ పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షకు 74 శాతం హాజరు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 7: హనుమకొండ జిల్లాలోని తెలంగాణ మోడల్ స్కూల్స్‌లో 6వ తరగతితోపాటు 7వ, 8వ, 9వ, 10వ తరగతుల్లో మిగిలిన సీట్లకు 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఆదివారం జరిగిన ప్రవేశపరీక్షలో 660 మంది విద్యార్థులకు 489 మంది హాజరైనట్లు డీఈవో ఎండీ అబ్దుల్‌హై తెలిపారు. 74 శాతం హాజరునమోదైనట్లు పేర్కొన్నారు. ఉదయం జరిగిన 6వ తరగతి పరీక్షకు 336 మందికి 261 మంది, మధ్యాహ్నం జరిగిన 7, 8, 9, 10వ తరగతి విద్యార్థుల పరీక్షకు 324 మందికి 228 మంది హాజరైనట్లు వివరించారు.

వరంగల్‌లో ప్రశాంతంగా ముగిసిన ప్రవేశ పరీక్ష

గిర్మాజీపేట: వరంగల్ జిల్లాలోని ఆరు మోడల్ స్కూళ్లలో 6 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు డీఈవో వాసంతి తెలిపారు. 530 మంది బాలురు దరఖాస్తు చేసుకోగా, 380 మంది, 380 మంది బాలికలు దరఖాస్తు చేసుకోగా 286 హాజరయ్యారని ఆమె తెలిపారు.

ఐఎంఏ సేవలు అభినందనీయం

వరంగల్ మహానగరపాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

జ్యోతి ప్రజ్వలన చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 7 : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఐఎంఏ ఆధ్వర్యంలో 400 మంది పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'నా ఆరోగ్యం – నా హక్కు' అనే నినాదంతో ఈ సంవత్సరం ఆరోగ్య దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యాన్ని రక్షిస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్య రక్షణకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం సీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు కాళీప్రసాద్ రావు, ఉపాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, సీఎంహెచ్‌వో రాజేశ్, ఐఎంఏ వరంగల్ అధ్యక్షుడు మహ్మద్ అన్వర్, కార్యదర్శి బింగి శ్రీనివాస్, కోశాధికారి దిడ్డి శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

'నాగుర్లపై ఆరోపణలు అవాస్తవం'

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆరె సంక్షేమసంఘం బాధ్యులు

పరకాల, ఏప్రిల్ 7 : ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లుపై ఆత్మహత్యాయత్నం చేసుకున్న చిట్‌ఫండ్ కంపెనీ యజమాని దూమాల బాపురావు చేసిన ఆరోపణలు అవాస్తవమని, చిట్‌ఫండ్ కంపెనీతో నాగుర్లకు ఎలాంటి సంబంధం లేదని సంఘం రాష్ట్ర నాయకులు చెట్టుపల్లి శివాజీ, మోర్తాల చందర్‌రావు అన్నారు. ఆరె సంక్షేమ సంఘం, ఉద్యమకారుల ఆధ్వర్యంలో ముందుగా దవాఖానలో చికిత్స పొందుతున్న దూమాల బాపురావును పరామర్శించారు. అనంతరం పట్టణంలోని స్వర్ణ గార్డెన్స్‌లో విలేకరులతో మాట్లాడారు. సోమనాథ్ చిట్‌ఫండ్ యజమాని దూమాల బాపురావు ఆత్మహత్యాయత్నం చేసుకోవడం బాధాకరమన్నారు. సోషల్ మీడియాలో బాపురావు పెట్టినవన్నీ పాత వీడియోలని, సానుభూతి పొందేందుకు వాటిని పోస్ట్ చేశాడన్నారు. చిట్‌ఫండ్ నుంచి నాగుర్ల బయటకు వచ్చారనేందుకు ఆధారాలు ఉన్నాయని, బాపురావు తన కుటుంబ సభ్యులతో వెళ్లి నాగుర్లను ప్రాధేయపడితేనే ఖాతాదారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు ఆయన కృషి చేశారన్నారు. నాగుర్ల వెంకటేశ్వర్లు తన భూమి లాక్కున్నాడని బాపురావు చేసిన వాదన సరికాదని, ఖాతాదారులకు ఇచ్చే డబ్బును సెటిల్ చేసేందుకు ఆయనే ప్లాట్లను అప్పగించాడని తెలిపారు. రాజకీయంగా నాగుర్ల ప్రతిష్టకు భంగం కలిగించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం నాయకులు, పలువురు తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

కాశీబుగ్గలో ఆకతాయిల హల్‌చల్

మద్యం మత్తులో పరస్పర దాడులు

కాశీబుగ్గలో పరస్పర దాడులకు పాల్పడుతున్న యువకులు

కాశీబుగ్గ, ఏప్రిల్ 7 : నగరంలోని కాశీబుగ్గ ప్రధాన రోడ్డులో ఆదివారం ఉదయం ఆకతాయిలు మద్యం మత్తులో హల్‌చల్ చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. కాశీబుగ్గకు చెందిన కొందరు యువకులు ఎస్ఆర్‌నగర్‌లో సిగరెట్లు తాగుతుండగా అక్కడి యువకులతో వాగ్వాదం జరిగింది. కాశీబుగ్గకు వస్తే మీ సంగతి చెబుతామని కొందరు యువకులు అన్నారు. కాగా, ఎస్ఆర్ నగర్ యువకులు కాశీబుగ్గ సెంటర్‌కు రాగా, ఇరువర్గాల వారు పరస్పరం దాడులు చేసుకున్నారు. దీంతో స్థానికులు, బాటసారులు భయాందోళనకు గురయ్యారు. దాడులకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పవిత్ర రంజాన్ పండుగ సారాంశం గొప్పది

బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎర్రబెల్లి, దాస్యం వినయ్‌భాస్కర్, మైనార్టీ నాయకులు

హనుమకొండ, ఏప్రిల్ 7: పవిత్ర రంజాన్ పండుగ సారాంశం చాలా గొప్పదని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఆదివారం సాయంత్రం బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఖుద్దూస్ అధ్యక్షతన ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ ప్రజలందరూ సోదరభావంతో మెలగాలన్నారు. మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే శక్తులతో జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. ఏటా రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్లు సుందర్‌రాజ్, మర్రి యాదవ రెడ్డి, సైలానీబాబా, అష్టల్, అబ్దుల్ మజీద్, నిసార్, మగ్దుం, మాజీ డిప్యూటీ మేయర్ సిరాజుద్దీన్, బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు నయీమొద్దిన్, నాయకులు ఖలీల్, ఇస్మాయిల్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్ పాల్గొన్నారు.

2000-03 విద్యా సంవత్సరం బీఎస్సీ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హనుమకొండ, ఏప్రిల్ 7: సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 2000-03లో బీఎస్సీ(ఎంపీసీ) చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 21 ఏళ్ల తర్వాత విద్యార్థులు కలుసుకొని నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాడు పాఠాలు బోధించిన లెక్చరర్లను కలిసి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అతిథులకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి, గౌరవ అతిథులుగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకరి జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ పీ రమేశ్, లెక్చరర్లు భాస్కర్‌రావు, సుమతి, ఉమామహేశ్వరి, సవిత, జోష్ణ, రవీందర్ పాల్గొన్నారు.

యదార్థ సంఘటన ఆధారంగా 'లవ్‌మౌళి'

మాట్లాడుతున్న హీరో నవదీప్

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 7 : ఓ యదార్థ సంఘటన ఆధారంగా 'లవ్‌మౌళి' సినిమాను తీశారని, మనుషులకు దూరంగా కొండ, కోనల్లో ఉండే మౌళికి అమ్మాయికి మధ్య జరిగిన ప్రేమ కథే ఈ సినిమా అని హీరో నవదీప్ తెలిపారు. ఆదివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. విభిన్నమైన, వైవిధ్యమైన ఈ చిత్రానికి అవనీంద్ర దర్శకుడిగా వ్యవహరించారి, ఈ చిత్రాన్ని నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్ బ్యానర్స్‌తో కలిసి నిర్మించినట్లు తెలిపారు. టాలీవుడ్ టాలెంటెడ్ టెక్నీషియన్స్‌కు అడ్డాగా మారిన సిస్పేస్ చిత్ర నిర్మాణ బాధ్యతలు తీసుకుందని చెప్పారు. ఈ చిత్రం నుంచి వచ్చిన ప్రతి అప్‌డేట్ వినూత్నంగా అందరినీ ఆక ట్టుకుందన్నారు. ఈ చిత్రంలో తాను చాలా డిఫరెంట్‌గా కనిపించనున్నట్లు తెలిపారు. ఈ సినిమాలో కొత్త ట్రెండ్ క్రియేట్ చెయ్యబోతున్నట్లు చెప్పారు. తన స్వీయ అనుభవాలే ఈ సినిమా కథ అన్నారు. విభిన్న ప్రేమకథలు కోరుకునే ప్రేక్షకులందరికి మా లవ్‌మౌళి మనసులకు హత్తుకుంటుందని, ఈనెల 19న చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించాలి

మూతపడిన వాటర్ ప్లాంట్

చెన్నారావుపేట, ఏప్రిల్ 7 : చెన్నారావుపేటలోని గ్రామ పంచాయతీ వాటర్ ప్లాంట్‌కు వెంటనే మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకు రావాలని గ్రామస్తులు కోరుతున్నారు. వాటర్ ప్లాంట్ నెల రోజులుగా పని చేయడం లేదని, సుమారు రూ.3లక్షలతో బీఆర్ఎస్ ప్రభుత్వం తాగు నీటి సమస్యను తీర్చేందుకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిందని, సర్పంచ్ పదవిలో ఉన్నత వరకు ప్లాంట్‌కు సమస్యలు వస్తే వెంటనే మరమ్మతులు చేయించేవారన్నారు. కానీ నెల రోజులుగా ప్లాంట్ పని చేయకున్నా అధికారులెవరూ పట్టించుకోవట్లేదని, ఇప్పటికైనా జీపీ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారమే పీఆర్టీయూ ధ్యేయం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 7: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పీఆర్టీయూ ధ్యేయమని, కొందరి స్వార్థప్రయోజనాల కోసం ఉపాధ్యాయులు మోసపోవద్దని పీఆర్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. హనుమకొండ ప్రకాశ్‌రెడ్డిపేటలోని ఉమ్మడి వరంగల్ జిల్లా యూనియన్ కార్యాలయంలో ములుగు జిల్లా అధ్యక్షుడు వాంకుడోత్ జ్యోతి అధ్యక్షతన ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పులి దేవేందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ప్రభుత్వం శాశ్వతంగా పరిష్కరించాలన్నారు. కొందరు రాజకీయ నాయకులు ఉపాధ్యాయ సంఘం పేరుతో స్వార్థ ప్రయోజనాల కోసం నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారన్నారు. ములుగు జిల్లా అధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ వేసవిలో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, డీఏలు త్వరగా మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు కొయ్యడ సురేందర్, రాజు, హర్షం సురేశ్, శ్రీనివాస్, శంకర్, యాదగిరి, వీ రవి, సుధాకర్, రౌతు రాజు, రాష్ట్ర నాయకులు రామగిరి సురేశ్, జిల్లా నాయకులు సంతోష్, చిరంజీవి పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

రాజయ్య (ఫైల్)

నల్లబెల్లి, ఏప్రిల్ 7 : చేతికి అందివచ్చిన రెండో కొడుకు అకస్మాత్తుగా మృతి చెందడంతో మనస్తాపానికి గురై తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని కొండైల్‌పల్లె గ్రామానికి చెందిన రాదారపు నవీన్(32) 8 నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి మానసికంగా కుంగిపోయిన నవీన్ తండ్రి రాజయ్య(60) శనివారం రాత్రి తన వ్యవసాయ భూమి వద్ద క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బానోత్ సారంగపాణి, ప్యాక్స్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్ రావు, ఉడుగుల ప్రవీణ్‌గౌడ్, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్, పాలెపు రాజేశ్వర్‌రావు, సర్పంచ్ మామిండ్ల మోహన్‌రెడ్డి ఉన్నారు. కాగా, పెద్ద కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు.

పురస్కారాల అందజేత

హనుమకొండ, ఏప్రిల్ 7: భట్రాజు ఒకప్పుడు కవిపుంగవులు, ఉపాధ్యాయులు, విద్యా దాతలుగా వెలుగొందారని తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం అధ్యక్షుడు దేవరాజు విష్ణువర్ధన్ రాజు తెలిపారు. ఆదివారం హంటర్‌రోడ్డులోని మాస్టర్జీ కళాశాలలో తెలంగాణ రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారాల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా వివిధ రంగాల్లో నైపుణ్యం చూపిన వారికి పురస్కారాలు అందజేశారు. వివిధ రంగాల్లో నైపుణ్యం చూపిన వారికి ఉగాది పురస్కారం అందజేయడం చాలా సంతోషంగా ఉందని రాజు అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. భట్రాజు కుల బాంధవులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు రుణపడి ఉంటాం

కృతజ్ఞతలు తెలిపిన బలగం సినిమా మొగిలయ్య

పెద్ది సుదర్శన్‌రెడ్డితో మాట్లాడుతున్న బలగం సినిమా మొగిలయ్య

నర్సంపేట రూరల్, ఏప్రిల్ 7 : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి తాము జీవితాంతం రుణపడి ఉంటామని బలగం సినిమా మొగిలయ్య అన్నారు. ఆదివారం నర్